# మమకారం

శ్రీమతి పతానేని శ్రీశైలభ్రమరాంబ.

(గతసంచిక తరువాయి)

ఆ మాట వినేసరికి సీతమ్మకి ఆనందాశ్చర్యాలతో నోటమాటే రాలేదు. నమ్మలేనట్లుగా కమలవంక చూస్తోంది. కొంటెతనంగా, చలాకీగా, అమాయకురాలిలా సిగ్గుపడ్తూ తల వంచుకుంది కమల ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ.

'అమ్మ దొంగల్లారా! ఎంత హంగామా చేస్తూ నాటకం ఆడారు? అంటూ అదురు గుండెల్ని చిక్కబట్టుకుని ఆనందంతో కమలను ఒళ్ళో కూర్చోబెట్టుకు ఆప్యాయతగా అడిగి అన్నీ తెల్సుకుంది సీతమ్మ. వారి చిలిపిచేష్టలతో తనని హడలకొట్టి ఆడించినందుకుకూడా నవ్వుకుంది మనస్సులో.

'త్వరగా సామాను సర్దుకో, మాకు నాల్గురోజుల కంటే క్యాజుల్లీవు లేదు. రేపే వెళ్లిపోవాలి.' అంది కమల.

'నేనెక్కడికి వస్తానమ్మా! నువ్వే శలవు పెట్టి ఇంక యిక్కడ వుండిపో. తల్లీ, పిల్లా ఏర్పడ్డాక మూడోనెల రాగానే అప్పుడు నేనూ నీతోనే వస్తా' అంది సీతమ్మ.

'ఉహూ! అల్లాకాదు. ఆయన్ని వదిలి నేనుండలేను. అదీకాక మేము ఉద్యోగం చేస్తున్న కాలేజీలో మిగతా లెక్చరర్సు అంతా 'మీ పెంపుడు అమ్మగారు ఎప్పుడు వస్తారని వేధించుకు తింటూంటే, వాళ్లకి సమాధానాలు చెప్పేసరికి తలప్రాణం తోక్కొస్తోంది. నిన్ను తీసుకొస్తామని అందరితోనూ డబాయించి వచ్చాం. ఇప్పుడు నువ్వు రాకపోతే ఎంత నవ్వులాటగా యుంటుందో నీకుమాత్రం తెలీదూ?'

'ఉన్న ఊరినీ, కన్న తల్లినీ ఒదిలి రావాలంటే చాలా కష్టం కమలా. అదీకాక అక్కడ నాకేం తోస్తుంది చెప్పు? ఇక్కడ మొదటినుంచీ తెల్సిన ఊరు కాబట్టి ఎంతో గౌరవంగా గడిచిపోతోంది. ఒక ఊరికి రాజే మరో ఊరికి... నేను రాలేనమ్మా! ఏదో పెద్దదాన్ని రామ, కృష్ణా అంటూ ఇక్కడే యుంటా.

'అదేమిటండీ అల్లా అంటారు? అక్కడ మీకు ఇక్కడికంటే గౌరవం తక్కువగా యుంటుందనా మీ అభిప్రాయం? లెక్చరరీ కమలాదేవిగారి తల్లిగారు లేడీస్ క్లబ్ ప్రశిడెంటుగారి పెంపుడు తల్లి. ఇంకా బామ్మ అనే బిరుదు పొందబోయే సీతమ్మగారికి, అక్కడ గౌరవానికి లోపం రాదని నేను హామీ ఇస్తా. కాలక్షేపమంటారా? రాత్రింబగళ్లు రేడియో ఎడతెరిపి లేకుండా వద్దన్నా మానకుండా హోరెత్తుతుంది. మీ కమల మహిళా సంఘాల్లో ఇచ్చే ఉపన్యాసాలు వినొచ్చు కావాలంటే క్లబ్బుకి వెళ్లినా ఫరవాలేదు... ఇంకా యెన్నో వుంటాయి' అన్నాడు మూర్తి.

'ఆలోచిద్దాంలే. నిల్చున్న పళంగా రమ్మంటే ఎల్లాగమ్మా కమలా. పోనీ ముందుగానైనా ఓ ఉత్తరం వ్రాయలేకపోయావా? ఇప్పుడు నాకు కొంచెమైనా అవకాశంలేదు.'

'పోన్లే. నువ్వు రానంటే, ఇంక ఇక్కడ వుండడం అనవసరం. నువ్వింత నిష్కర్షగా మాట్లాడ్తావని నేనెప్పుడూ అనుకోలేదు. నేనేమో చేసుకోలేకుండా యున్నా. పదిగంటలయ్యేసరికి, కాలేజీకి వెళ్లకతప్పదు కదా? పోన్లే! నాకెవ్వరూ చేసిపెట్టే దిక్కులేరనుకుంటా. లోకంలో తోడూ నీడ లేనివాళ్లల్లో నేనొక్కర్తెననుకొంటా. నాకోసం! నేనేమైపోయినా ఇంక సంబంధం లేదనుకొంటే బాధలేదులే. ఇంతవరకూ నా కష్టసుఖాల్లో కూర్చోబెట్టి చెయ్యడానికి నాకోసం నువ్వు ఉన్నావనుకొని వచ్చా. ఒకవేళ నేను ఈ కాన్పుతో చచ్చిపోయినాకానీ నువ్వేమీ విచారించనక్కర్లేదు. నీ కమల నీ దగ్గరనుంచి వెళ్ళిపోగానే చచ్చిపోయిందనుకొంటున్నావుకదూ?' అంటూ అనేసి చకచకా నడిచి వీధిలోకి వెళ్ళిపోయింది కమల. ఆమె వెనకాలే మూర్తికూడా బయటకు వెళ్ళిపోయాడు.

వాళ్ళు వెళ్ళిపోయాక ఆ పెట్టె, బేగ్, ను చూస్తూ అల్లాగే కూర్చుండిపోయింది సీతమ్మ. కమల, మూర్తి అన్న మాటలు మనసులోకి తెచ్చుకొంటోంది. ఇన్నాళ్ళకి తన కమల తల్లికాబోతూన్నందుకు హృదయపూర్వకమైన ఆనందంగానే యుంది. వాళ్ళింట్లో యుండి, వాళ్ళ సంపాదనమీదే తనుకూడా ఆధారపడి యుండడం సబబుగా కన్పించడంలేదు. పోనీ! వెళ్లడం మానేస్తే? లక్ష్మీదేవిలా ఇక్కడికొచ్చి, నేను వస్తానని కొండంత ఆశతో వచ్చిన నా చిట్టితల్లి తన మనస్సుకి

భిన్నంగా జరగడంతో మనస్సులో బాధపడ్డమే కాకుండా...ఓపలేని పిల్లివంట చేసుకోలేక ఎంత వేగి పోతోందో. నేనొక్కర్తెనీ మాత్రం ఇక్కడయుండి దానికోసం బెంగపెట్టుకు ఏడ్వడమేగా?...కమలక్కి నొప్పులు వచ్చినట్టు, తను దగ్గర లేనట్టు, ఆమె ఎంతో ఘోరంగా బాధతో విలవిల్లాడిపోతూ, తల్లిమీద మమకారంతో దగ్గరకొచ్చిన బిడ్డను కాళ్లతో తన్ని పంపించేశావు; కసాయివాని కత్తికీ, నీ హృదయానికీ అట్టే భేదం యున్నట్లు కన్పించడంలేదు. నువ్వు నా దగ్గర లేకపోవడంతో నా ఖర్మమింతే' అని అంటూ న్నట్లు ఊహించేసరికి నిలువునా ఒణికిపోయింది సీతమ్మ.

'నీ కమలను వదలకు. ఆమెకు నీకంటే ఈ సమయంలో ఆప్తులెవ్వరూ లేరని అంతరాత్మ ఘోషించింది. తప్పకుండా నా కమలతో వెడ్తా' అని మనస్సా నిశ్చయించుకుంది సీతమ్మ.

'ఏం కమలా! ఈపాటికి ఆవిడ మనస్సు మారిపోతుందా?' అన్నాడు మూర్తి సాయంత్రం పార్కులో కూర్చుని.

అంత ప్ట్రాంగ్‌గా నేననేసి వచ్చాక ... ఈసరికి ప్రయాణానికే రెడీ అయి కూర్చుంటుందికూడా. నన్ను వదిలి అసలు వుండనేలేదండీ, ఇంక మనంకూడా ఆవిణ్ణి ఇక్కడ ఒంటరిగామాత్రం వుండనివ్వద్దు. ఆవిణ్ణి రమ్మని ఎన్నిసార్లు అడిగినా ఎప్పుడూ ఒప్పుకోలేదు. సాధారణంగా ఆవిడ గుమ్మం కదలడం నా జ్ఞానమొచ్చాక చూళ్ళేదు, అంది నవ్వుతూ కమల.

చీకటిపడ్డాక ఇంటికి వచ్చిన కమల, మూర్తిని చూచి గుమ్మంలోనే 'అమ్మమ్మా! కమలా! నేను సిద్ధంగా యున్నానమ్మా! ఎప్పుడు బయల్దేరామన్నా సరే నీ ఇష్టం, అంది సీతమ్మ.

'ఇంక మళ్ళీ మిమ్మల్ని ఈ ఊరుమాత్రం రానిచ్చేది లేదండోయ్' అన్నాడు మూర్తి నవ్వుతూ.

'నాయనా! నాకుమాత్రం కమల దాని పిల్లలు తప్పించి ఇంకెవరు కావాలి? నాకున్న ఆస్తి అంతా మీదేకదా నాయనా!' అంది సీతమ్మ నిశ్చలంగా.

'మాకు కాదండోయ్! కమల పిల్లలకి, ఏం కమలా? అమ్మ ఒళ్ళో దూరిపోయావ్? ఇంక రేపటినుంచి నాతో ఏమీ చెప్పక్కర్లేకుండా మీ...'

'అందుకనేకాబోలు మీ అమ్మదగ్గరకెళ్ళి అన్నాళ్ళు వుండిపోయారు. మహా చెప్పొచ్చారులెండి' అంది కిలకిలా నవ్వుతూ కమల.

ఆ మర్నాడే సీతమ్మ మహానందంతో బయల్దేరింది. గుంటూరులో ఇంక శాశ్వతంగా కమల దగ్గరే యుండడానికి. విజయగర్వంతో దంపతు లిద్దరూ తీసుకువెళ్ళిపోయారు. (సమాప్తం)


మీ వ్యవసాయాభివృద్ధికి...!




Manufacturing 3/4 H.P. — 3 Phase Motors 960. 1450 & 2890 R.P.M. 2 H,P. to 20 H.P.. —2 Phase Monoblock Sets. 1/2 H.P to 2 H.P. — Single Phase Motors.
Dealers:—M/s. SIVARAJ ELECTRICALS, No. 53, Linghi Chetty Steet, Madras-1
Sole Agents for Eastwhile Hyderabad & Maharashtra State, M/s Vijai, Agencies Giriraj Lane, Bank Steet, Hyderabad-1
Agents for Cuddappah, Dt ;—
M/S. V.S. REDDY & Co.,
4/189, Dr. Ayyaswami Pillai St,,
CUDDAPPH (A.P.)


''కథాంజలి''లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రమూ బాధ్యులు కాము.

—సంపాదకుడు.